**"సావిత్రమ్మ గారూ! పనైందా?" వీధివాకిలి తుడుస్తూ యెదురింటి గుమ్మంలో పలికి తొంగిచూసింది సుభద్రమ్మ.**




"ఆ... అయినట్లే. అన్నం వండాలంతే. మీ పని కాలేదా?" చేటలో బియ్యం పోసుకుని రాళ్ళు యేరుతూ బయటికి వచ్చింది సావిత్రి.

"అయ్యో! నా పనంతా యివ్వాళ ఛండాలంగా తయారైంది. ఏం చెప్తాను."

"ఏమిటైంది" నవ్వుతూ అడిగింది సావిత్రి.

"పండుగ పూట స్పెషల్ చేద్దామని కావల్సిన వస్తువులన్నీ తెప్పించి అప్పటి కప్పుడు చేశానా? అంతా పెంటపాలై పోయింది."

"అదేమిటి?"

"మరిక అడక్కండి" నూనె. సెనగపిండి. బెల్లం అంతా అయిదు రూపాయల సామాను వేస్టయింది. ఎప్పుడూ చేసేదే. ఈ సారి ఎందుకిలాగైందని మనసంతా ఏం బాగోలేక అలా కూర్చుండిపోయానుసుమండీ."

"అయ్యో పాపం" సానుభూతిగా అంది సావిత్రి.

"మరిక చెప్పేదేమిటి? సాయంత్రం చుట్టాలొస్తారట. వాళ్ళొచ్చే వేళకు తయారుగా వుంటుందని చేశానండీ బాబూ. దేనికది విడివిడిగా జోను జోనుగా తయారైంది. అదెట్లా పెట్టను వాళ్ళకు."

"కాదండీ మరి" సావిత్రమ్మ గుండెల్లో గుబులు మొదలైంది.

"పోనీ వేరే తెప్పించి చేద్దామన్నా.... ఏమండీ ఆ లలితమ్మగారు చూశారూ! అసలు పండుగ పూట ఎవరైనా అప్పుకు వెళ్తారా? నా దగ్గర వున్నదే పది రూపాయలు. నెలాఖరు-పండుగకని దాచానండీ యిన్ని రోజులూ. ఒక్క అయిదుంటే అప్పివ్వరూ. సాయంత్రం యిస్తాను అంటూ మధ్యాహ్నం వచ్చి పట్టుకెళ్ళిందండీ."

"మరి యివ్వలేదా?"

"ఎక్కడండీ! ఇందాకా యెంచక్కా మొగుడూ, పెళ్ళాం సినిమాకట వెళ్ళారు. అప్పులలాగే పెట్టుకుని సినిమాకి వెళ్ళకపోతే యేమిటండీ. నాకు మహా చిరాకుసుమండీ యిలాంటి వాళ్ళనుచూస్తే."

సావిత్రి భయం నిరాధారం కాదని రూఢీచేసుకుంది.

"అవునండీ!" ఇంకా ఏమో చెప్పబోతూన్న సుభద్రమ్మను ఆపేసి బియ్యం కడిగి అన్నానికి పెడేసి వస్తానుండండని లోపలికి వెళ్ళింది సావిత్రి.

సుభద్రమ్మ వదలిపెట్టలేదు. చీపురు ప్రక్కకు గిరవాటేసి తిన్నగా యింట్లోకి వచ్చింది.

"అదేంటోనండీ! ఎవరింటికైనా అప్పుకెళ్ళాలంటే తలకొట్టేసినట్లౌతుంది. అందులో పండుగ పూట. పైగా అడిగితేనండీ ఆవిడకెంతకోపమో!"

"పైగా అదొకటా! అప్పు తీసుకుని ఎంతకూ తిరిగి యివ్వకపోతే ఎదుటివాళ్ళు అడగరేమిటి? కోపమైతే ఎలా?" జడ వేసుకోవాలని విప్పదీసుకుంటూంది వెంట్రుకల్ని సావిత్రి. దువ్వెనకోసంచూస్తే కనపడలేదు.

"ఈ పిల్లలండీ బాబూ! పెట్టిన చోట వస్తువుపుంచరండీ. చచ్చిపోతున్నాను లేక లేక" అంది

"అదంతేనండీ! ఆవిడై ఆవిడ యిచ్చే దాకా చకోర పక్షిలా ఎదురు చూడాల్సిందే మనం." తన ధోరణే తనది.

"బాగుంది. ఇంకొంతమంది ఉంటారండీ సుభద్రమ్మగారూ? అప్పుడు పది. అప్పుడు యిరవై పైసలడిగి పుచ్చుకుంటారా. అసలు అవి వాళ్ళ దృష్టిలో డబ్బు క్రింద లెక్కకాదు. తీసుకున్నది అప్పుకాదు. అంతా కలిపి మొత్తం రూపాయలైనా సరే. మాకు తెలిసినావిడ ఒకావిడ వుండేదండీ బాబూ! ఆవిడతో అలాగే అవస్థపడేదాన్ని." గమ్మత్తుగా మారిపోయింది సుభద్రమ్మ మొఖం.

"మరిక అడక్కండి. నేనంతా లెక్క చూసి చూస్తే ఒకటో రెండో రూపాయలు తేలేది. ససేమిరా యిచ్చేదికాదు. నేనంతకంటే మొండిదాన్నండీ. వసూలుచేసేవదిలే దాన్ని. మనకూ పైసలువూరికేరావుకదండీ"

"కాదండీ మరి!" సుభద్రమ్మ యిక అక్కడ నిలువలేదు. ఆమె కాళ్ళు బయటికి సాగాయి.

"అన్నట్లు ఏమండీ! మీరు నాకు రూపాయి పావలా యివ్వాలండీ."

"రూపాయి పావలానా?" సుభద్రమ్మ కాళ్ళు ఆగిపోయాయి గుమ్మందగ్గరే.

"అవునండీ! మొన్న పావలా- నిన్న పూలకు అర్ధరూపాయి. అంతకు ముందు ముప్ఫై పైసలూ...."

"సరిసరి.... మరిక చెప్పకండి. గుర్తుంది. యిప్పుడే తెచ్చియిస్తాను" పరుగెత్తినట్లే గుమ్మం దాటింది సుభద్రమ్మ.

"అడిగానని మరేమనుకోకండేం...."

సావిత్రి మాటలు ఆమె చెవుల దాకా వెళ్ళాయో లేదో మరి!!

—పుటపర్తి తులజ



గుంటూరు హిందూ కళాశాల వక్తృత్వ సంఘంవారి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాల జోకుల పోటీ జరిగింది. ఈ పోటీలో వివిధ కళాశాలల నుంచి 20 మంది విద్యార్థినీ. విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పొందిన ఉయ్యూరు కళాశాల విద్యార్థి పి. మురళీధరరావుకు షీల్డు అందజేస్తున్న డాక్టర్ కె శారద.